


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శనివారం 19-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :93 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# నిషేధిత భూములకు సర్కార్ చెక్!




22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌కు కీలక బాధ్యత

సభ్యులుగా లా సెక్రటరీ, స్టాంప్స్ ఐజీ నియామకం

నిషేధిత జాబితాపై ప్రజల విజ్ఞప్తుల పరిశీలన

క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కార మార్గాలపై కసరత్తు

భూ యజమానుల సమస్యలకు త్వరిత పరిష్కారంపై ఫోకస్

# మక్కా దిశగా డ్రోన్.. సౌదీ యాక్షన్!

మక్కా వైపు దూసుకొచ్చిన డ్రోన్

సౌదీ రక్షణ వ్యవస్థతో కూల్చివేత

ముస్లిం దేశాల తీవ్ర స్పందన

ఓఐసీ ఘాటైన హెచ్చరిక

హౌతీలపై సౌదీ ఆరోపణలు

యెమెన్‌లో మళ్లీ ముదిరిన పోరు

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** మక్కా వైపు హౌతీల డ్రోన్ దూసుకొచ్చిందన్న వార్తతో ముస్లిం ప్రపంచం ఒక్కసారిగా అగ్నిగోళంలా మారిపోయింది. కాబా ఉన్న పవిత్ర నగరంపైకి యుద్ధం నీడ పడిందన్న వార్త కోట్లాది ముస్లింల గుండెల్లో ఆగ్రహాన్ని రగిలించింది. ఆ డ్రోన్ మక్కా నిషేధిత గగనతలంలోకి చేరకముందే సౌదీ అరేబియా వైమానిక రక్షణ వ్యవస్థ దాన్ని గాల్లోనే కూల్చేసింది. ఒక చిన్న లోహపు యంత్రం ఆకాశంలో ముక్కలైంది. కానీ దాని వెంట లేచిన కోపానికి అంత త్వరగా ముగింపు కనిపించడం లేదు.




పాకిస్థాన్ నుంచి టర్కీ వరకు, మలేషియా నుంచి బంగ్లాదేశ్ వరకు, మాల్దీవులు, యూఏఈ, సోమాలియా వరకు ముస్లిం దేశాలు తీవ్రంగా స్పందించాయి. మక్కా పవిత్రతను, అక్కడి ప్రజల భద్రతను తాకే ఏ ప్రయత్నమైనా సహించబోమన్న సందేశం వెలువడింది. ఇస్లామిక్ దేశాల సమాఖ్య ఓఐసి కూడా ఘాటుగా స్పందించింది. మక్కా, మదీనా ప్రాంతాల వైపు జరిగే దాడులు అమాయకుల్లో భయాన్ని రగిలించడంతో పాటు ప్రపంచ ముస్లింల మనోభావాలను కుదిపేస్తాయని ఆ సంస్థ చెప్పింది.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

దానం నాగేందర్‌పై హైకోర్టు కీలక తీర్పు

స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం

2024 ఏప్రిల్ నుంచే అనర్హత వర్తిస్తుందని స్పష్టం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి దానం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీ-ఫారమ్‌పై పోటీ

అనర్హత కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేసిన పిటిషనర్లు

2 లో

# 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

ఫార్ములా ఈ కేసుపై కేటీఆర్ ఫైర్

రూ.1000 కోట్లకు ఆస్తుల ఆఫర్

లక్ష కోట్ల ఆరోపణలపై కౌంటర్

తప్పుడు కేసులు పెడుతున్నారన్న కేటీఆర్

న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం

ఎప్పుడైనా విచారణకు సిద్ధమని స్పష్టం

బ్రాండ్ ఇమేజ్ కోసమే రేస్ నిర్వహణ

కాంగ్రెస్ తీరుపై కేటీఆర్ విమర్శలు



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు ఫార్ములా ఈ రేస్ నిర్వహించామని, అందులో అవినీతి జరిగిందని తప్పుడు కేసులు పెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ కారు రేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసులకు భయపడము.. న్యాయవ్యవస్థలపై తమకు అపారమైన నమ్మకం ఉందన్నారు. పోలీసులు ఎంత వేధించిన ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు వెన్నుదన్నుగా ఉందని ధీమా వ్యక్తం చేశారు.

2 లో

# హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!

మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు

9 మంది నిందితులకు జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం

శిక్ష పడిన వారిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు

ఉద్యోగాల ఆశ చూపి మహిళలను అక్రమంగా తరలింపు

బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఏ దర్యాప్తు

12 మంది నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ

సాక్ష్యాధారాల పరిశీలన తర్వాత నేరం రుజువు

2 లో

# జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!

జీవో 118 బాధితులకు ప్రభుత్వం భారీ ఊరట

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి క్రమబద్ధీకరణ

1000 చదరపు గజాల లోపు స్థలాలకు అవకాశం


చదరపు గజానికి రూ.250 రుసుముతో క్రమబద్ధీకరణ

ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ప్రక్రియకు కదలిక

లబ్ధిదారులకు త్వరలో హక్కు పత్రాల జారీ

2 లో

# ‘కల్పిత నాయకుడు’ పుస్తకానికి చెక్!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** డాక్టర్ బీఆర్ అంబేదర్‌పై అనుచిత వ్యాఖ్యలతో ‘కల్పిత నాయకుడు’ (ఫ్యాబ్రికేటెడ్ లీడర్) పుస్తక రచయిత వరప్రసాద్ అలియాస్ హమారాప్రసాద్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినందున పుస్తకావిషరణ జరిగే ప్రసక్తే లేదని ప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది.

# డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!




అనుమతులపై పోలీసులకు కీలక విజ్ఞప్తి

హోంమంత్రి, డీజీపీకి లోకేష్ ట్యాగ్

అనుమతుల ప్రక్రియ సులభతరం చేయాలి

వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని సూచన

డీజే వాహనాలు సీజ్ చేయొద్దని విజ్ఞప్తి

నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పోలీసులకు అనిత కీలక ఆదేశాలు




# ఫ్యూచర్ సిటీ డేటా దూకుడు!

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు వరుస కడుతున్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) శంకుస్థాపనతో మొదలై టీసీఎస్ హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్, ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ ప్రాజెక్టులు చేరడంతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్లస్టర్లలో ఒకటిగా ఫ్యూచర్ సిటీ అవతరిస్తున్నది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్, టీసీఎస్ హైపర్వాల్ట్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చూస్తున్న ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు హైదరాబాద్ వైపు మొగ్గు చూస్తున్నాయి. అంతర్జాతీయ డేటా, ఏఐ కంపెనీలు తమ ప్రాసెసింగ్ అవసరాల కోసం హైదరాబాద్ వైపే చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాలకు ఫ్యూచర్ సిటీ కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది.

మిగతాది 2 లో..

- డేటా సెంటర్లకు ఫ్యూచర్ సిటీ అడ్డా
- అమెజాన్‌తో భారీ పెట్టుబడుల జోరు
- టీసీఎస్ నుంచి రూ.70 వేల కోట్ల దూకుడు
- ఏఐ డేటా హబ్‌గా హైదరాబాద్
- ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ భారీ ప్రాజెక్ట్
- కంట్రోల్ ఎస్‌తో 2 గిగావాట్ల సామర్థ్యం
- ఎస్‌బీఐ డేటా సెంటర్‌కు 10 ఎకరాలు
- ప్రపంచ టెక్ దిగ్గజాలకు కొత్త గమ్యం
- జీసీసీలకు ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జోన్

# సీమ పౌరుషం చూపిస్తా!

కొత్త పార్టీతో సీమ రాజకీయాల్లో వేడి

సీమ పౌరుషం చూపిస్తామన్న విజయసాయి

రెడ్ల ఆత్మగౌరవమే పార్టీ లక్ష్యం

రెడ్డి కార్పొరేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నేత

సీమ అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ విమర్శలు

రాయలసీమ నుంచి వలసలపై ఆవేదన

యువత అభివృద్ధి కోసం పనిచేయాలి

సీమను ‘రతనాల సీమ’గా మారుస్తాం




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్రంలో త్వరలో స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీ రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా నిలుస్తుందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడే పార్టీగా పనిచేస్తుందని, అసలైన సీమ పౌరుషం ఎలా ఉంటుందో రాబోయే రోజుల్లో చూపిస్తామని స్పష్టం చేశారు.

**రెడ్డి కార్పొరేషన్ ఏదీ? :** రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులకు పూర్తి న్యాయం చేస్తూనే రెడ్ల ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యతను తమ పార్టీ తీసుకుంటుందని తెలిపారు.

# ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

టెంపోలోనే సామూహిక అత్యాచారం

కత్తితో పొడిచి హత్య

పొలంలో మృతదేహం పడేసిన నిందితులు

50కి పైగా సీసీటీవీల పరిశీలన

ఐదు రోజులు టెంపో కదలికల ట్రాకింగ్

ముగ్గురు మైనర్లతో నలుగురు అరెస్ట్

కత్తులు, దుస్తులు, టెంపో స్వాధీనం




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున నిర్భయ తరహా దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పదహారేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పడేసిన ఘటన కలకలం రేపుతోంది. ఈ దారుణానికి సంబంధించిన కుళ్లిపోయిన మృతదేహం సెప్టెంబర్ 13న లభించగా.. పోలీసులు దర్యాప్తు చేసి నలుగురు నిందితులను నేడు అదుపులోకి తీసుకున్నారు.

**టెంపోలో గ్యాంగ్‌రేప్.. సైలెంట్‌గా మర్డర్**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బాలికకు, నిందితులకు ముందుగానే పరిచయం ఉంది. ఘటన జరిగిన రోజు ఆమె వారితో కలిసి టెంపోలో ప్రయాణించింది.

Registered No : APTEL/25/A0818



# సీమ పౌరుషం చూపిస్తా!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఇన్ని ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతానికి చెందిన నేతలే అయినప్పటికీ, సీమను ఏమాత్రం అభివృద్ధి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాలు రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలిస్తున్నప్పటికీ రాయలసీమకు జరిగింది శూన్యమని మండిపడ్డారు. ఈ రెండు కుటుంబాలు కలిసి సీమలోని ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయాయని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఈ కుటుంబాలకు రాజకీయాలు గుర్తుకొస్తాయని, సీమలో పుట్టిన ఈ నాయకులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడి ఈ ప్రాంతాన్ని విస్మరించారని ఆరోపించారు.

రాయలసీమను 'రతనాల సీమ' చేస్తాం..

రాష్ట్రంలో అత్యధికంగా ప్రజలు వలస వెళ్తున్నది రాయలసీమ నుంచే కావడం చాలా బాధాకరమైన విషయమని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ యువత ఇకనైనా వ్యక్తుల కోసం కాకుండా ఈ గడ్డ అభివృద్ధి కోసం, రాష్ట్ర దేశాభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ పార్టీల వల్ల రాయలసీమ ఎప్పటికీ బాగుపడదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతను భాగస్వామ్యం చేస్తూ రాయలసీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీ అన్ని కులాలను, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఆయనపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. దానం నాగేందర్ విషయంలో అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మసనం, స్పీకర్ ఉత్తర్వులపై స్టే విధించింది. ఈ తీర్పుతో 2024 ఏప్రిల్ నుంచే ఆయన శాసనసభ్యుడిగా అనర్హతకు గురైనట్లు కోర్టు స్పష్టం చేసింది.


బీఆర్ఎస్ నుంచి గెలుపు..

2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అయితే, బీఆర్ఎస్‌కు అధికారికంగా రాజీనామా చేయకుండానే 2024 లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ బీ-ఫారమ్ పోటీ చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మరొక పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శలు వచ్చాయి.

స్పీకర్‌కు ఫిర్యాదు..

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, విచారణ చేపట్టిన స్పీకర్.. దానం నాగేందర్ చట్టబద్ధంగా పార్టీ మారినట్లు ఆధారాలు లేవంటూ ఆ పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం స్పీకర్ నిర్ణయం చెల్లదని తేల్చిచెప్పిన హైకోర్టు, దానం నాగేందర్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసింది.

# జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!



GOVERNMENT OF TELANGANA
REVENUE (LAND ADMINISTRATION. I) DEPARTMENT

Memo. No. 46940/Land Admin. I(1)/2026-3 Dated:[illegible]-09-2026

Sub: Lands - G. O. Ms. No. 118 (L. B. Nagar Constituency) – Short discussion on "Issues related to Section 22 – A of Registration Act" in the Telangana Legislative Assembly on 16-09-2026 – Instructions – Issued.

Ref's: 1) G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022.
2) G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023.

<<>> <<<>>> <<>>

The attention of the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad and District Collector Ranga Reddy and Medchal Malkajgiri is invited to the references cited and they are requested to dispose all 9792 applications received under G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022 read with G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023 within a period of One Month subject to Hon'ble Court Orders, if any.

LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

To
The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad.
The District Collector Ranga Reddy and Medchal Malkajgiri.
SC

//forwarded by order //

Asst. Secretary to Govt.

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీవో 118 భూముల సమస్యకు పరిష్కారం చూపింది. గత 15, 20 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించింది. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను త్వరలోనే పరిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను కూడా విడుదల చేసింది.

జీవో 118 నేపథ్యం ఇదే..

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కార్వాన్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మేడ్చల్ తదితర నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని దీర్ఘకాలంగా ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజల స్థలాలను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో గతంలో ఈ జీవో 118ని తీసుకువచ్చారు. ఈ విధానం కింద 1000 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలను నిర్ణీత రుసుముతో క్రమబద్ధీకరించే అవకాశం కల్పించారు. చదరపు గజానికి రూ.250 చొప్పున రుసుము చెల్లించేలా నిబంధన రూపొందించారు. అయితే, ఎన్నికల కోడ్, ఇతర టెక్నికల్ కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారులకు సకాలంలో హక్కు పత్రాలు ఇంకా అందలేదు. ఫలితంగా జీవో 118 అమలులో జాప్యం జరిగి సమస్య కొనసాగింది. ఈ నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, లబ్ధిదారులకు హక్కు పత్రాలు జారీ చేసే ప్రక్రియపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

# నిషేధిత భూములకు సర్కార్ చెక్!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన చేయగా, ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. భూముల జాబితాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విజ్ఞప్తులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపడానికి ప్రభుత్వం ఓ హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ముగ్గురు అధికారులతో కూడిన ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్..

ఈ ఉన్నత స్థాయి కమిటీకి చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ ను ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవహరించనున్నారు. ఈ కమిటీ నిషేధిత భూముల జాబితాలోని అంశాలపై సమగ్రంగా చర్చించి, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు తగిన కార్యాచరణను రూపొందించనుంది. సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా భూ యజమానుల సంవత్సరాల తరబడి ఉన్న సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

మొదటి పేజీ తరువాయి

ప్రయాణ సమయంలో వారు టెంపోలోనే కలిసి మద్యం సేవించారు. ఆ తర్వాత బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా నార్త్‌వెస్ట్ ఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో, కుషాక్ రోడ్డు సమీపంలోని జైపాల్ రాణా అనే వ్యక్తి పొలంలో పడేశారు. సెప్టెంబర్ 13న ఈ కుళ్లిన మృతదేహం స్థానికులకు కంటపడింది. అయితే, మృతదేహం కనీసం లింగ నిర్ధారణ చేయడానికి కూడా వీలుకాని స్థితిలో ఉంది. కొన్ని భాగాలను వీధి కుక్కలు తినేయగా, ఒక చేయి వేరుపడి కనిపించింది. బాలిక తరచూ ఇంటి నుంచి వెళ్లి కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండటంతో, కుటుంబ సభ్యులు ఆమె కనిపించట్లేదని ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

50కి పైగా సీసీటీవీ ఫుటేజ్‌ల పరిశీలన..

ఈ ఘటనపై పోలీసులు బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడం, నిందితుల గుర్తింపు మొదట స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు ప్రత్యేక బలగాలతో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం దొరికిన ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మార్గాల్లో 50కి పైగా సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ సమయంలోనే హత్య స్థలానికి సమీపంలో ఓ టెంపో కదులుతున్నట్లు గుర్తించారు. అయితే, చీకటి కారణంగా దాని రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించలేదు. దీంతో దర్యాప్తు అధికారులు మరికొన్ని సీసీటీవీ లొకేషన్ల ఆధారంగా ఆ టెంపో కదలికలను దాదాపు 5 రోజుల పాటు నిమిషం నిమిషానికి ట్రాక్ చేశారు.

నిందితుల్లో ముగ్గురు మైనర్లు.. ఆయుధాల స్వాధీనం

ఈ నెల 15, 16 తేదీల రాత్రి సమయంలో సుదీర్ఘ సెర్చ్ ఆపరేషన్ తర్వాత అనుమానిత టెంపోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. దీంతో ఈ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు మైనర్లతో సహా మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడిని ఖద్దా కాలనీకి చెందిన శివమ్ అలియాస్ సుదామ అలియాస్ చుచుగా గుర్తించారు. మిగిలిన ముగ్గురు మైనర్ల వయస్సు 16, 17 ఏళ్లుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేరానికి ఉపయోగించిన రెండు కత్తులు, నిందితులు ధరించిన దుస్తులు, టెంపోను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోరెన్సిక్, టెక్నికల్ సాక్ష్యాధారాలను పరిశీలించేందుకు పోలీసుల తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** మానవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్‌లోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2019లో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో విచారణ ముగిసి సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నేరం రుజువుకావడంతో ఏకంగా 9 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తుది తీర్పును ప్రకటించింది. శిక్ష పడిన 9 మందిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు ఉండటం గమనార్హం.

ఉద్యోగాల ఆశ చూపి.. వ్యభిచారంలోకి కూపంలోకి..

బంగ్లాదేశ్ నుంచి మహిళలను అక్రమంగా భారత్‌కు తరలించిన ఉదంతం 2019లో తీవ్ర కలకలం రేపింది. నగర పరిధిలోని పహాడీ షరీఫ్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించి హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ను అధికారులు బట్టబయలు చేశారు. బాధితురాళ్లకు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించిన నిందితులు, వారిని అక్రమంగా తరలించి బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లుగా ఎన్ఐఏ దర్యాప్తులో స్పష్టమైంది. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ముఠా గుట్టును దర్యాప్తు సంస్థ రట్టు చేసింది. ఈ వ్యవహారంపై 2019లో పోలీసులు తొలిసారిగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ఈ కేసును రీ-రిజిస్టర్ చేసి తమ చేతుల్లోకి తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ అధికారులు ఈ కేసులో ఏ1 నుంచి ఏ12 వరకు మొత్తం 12 మంది నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం తీర్పు..

ఈ కేసులో న్యాయస్థానంలో పూర్తి వాదనలు పూర్తిగా ముగిశాయి. సాక్ష్యాధారాల సమగ్ర పరిశీలన అనంతరం నిందితులపై నేరం రుజువైంది. దీంతో హైదరాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఈ కేసులో తుది తీర్పును వెల్లడించింది. మొత్తం నిందితుల్లో 9 మందికి జీవిత ఖైదును ఖరారు చేస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పును వెలువరించారు.

# 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

మొదటి పేజీ తరువాయి

ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని.. పక్క రాష్ట్రాలు బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడం కోసం లండన్ వెళ్తుంటే ఇక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. టార్గెట్ కేసీఆర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు.. లక్ష కోట్లు సంపాదించామని కాంగ్రెస్ ప్రభుత్వం తమపై అసత్య ఆరోపణలు చేస్తుందన్నారు. "లక్ష కోట్లు కొల్లగొట్టామని రేవంత్ రెడ్డి అంటున్నారు.. రేవంత్‌కు మంచి ఆఫర్ ఇస్తున్నా.. రూ. 1000 కోట్లు ఇచ్చి మా పేరుపై ఉన్న లక్ష కోట్లు ఆస్తులు తీసుకోండి. మిగిలిన 99 వేల కోట్లు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకోసం ఖర్చు చెయ్యండి.. కాళేశ్వరంలో లక్ష కోట్లని ప్రచారం చేసినట్లుగానే ఇప్పుడు విషప్రచారం చేస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (ఇది కద నిజం):** వినాయక చవితి రోజు ప్రతిష్టించిన బొజ్జ గణపయ్య విగ్రహాలను సంబరాలతో సాగనంపుతున్నారు భక్తులు.. అయితే, డీజే వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడం.. వాహనాన్ని సీజ్ చేసిన ఘటనపై స్పందించిన మంత్రి నారా లోకేష్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాహనాలకు అనుమతుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీకి విజ్ఞప్తి చేశారు మంత్రి నారా లోకేష్.. నిమజ్జనానికి డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ తనకు పలువురు సందేశాలు పంపుతున్నారని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో హోంమంత్రి అనిత, డీజీపీ జోక్యం చేసుకుని డీజే వాహనాలకు అవసరమైన అనుమతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లోకేష్ కోరారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి, వేగంగా క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గణేష్ నిమజ్జనం సందర్భంగా ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని లోకేష్ పోలీసు శాఖను కోరారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకునేలా అధికారులు సహకరించాలని ఆయన తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. లోకేష్ తన ఎక్స్ పోస్టులో హోంమంత్రి అనిత, డీజీపీని ట్యాగ్ చేస్తూ ఈ విజ్ఞప్తి చేశారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. డీజే అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి అనుమతులు ఇచ్చేలా పోలీసు శాఖకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.

# 'కల్పిత నాయకుడు' పుస్తకానికి చెక్!


మొదటి పేజీ తరువాయి

అంబేదర్‌పై ఆరోపణలతో ప్రచురితమైన పుస్తకావిష్కరణను నిలిపివేయాలని, రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన జర్నలిస్ట్ ఏ జ్ఞానచంద్రన్‌మౌళి గురువారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పుస్తకాల విక్రయం జరిగితే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికే పుస్తకాల విక్రయం కోసం ఆన్‌లైన్ వేదికలను ఎంచుకున్నారని తెలిపారు. ప్రభు త్వ తరఫు న్యాయవాది వాదనలు కూడా విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

# మక్కా దిశగా డ్రోన్.. సౌదీ యాక్షన్!

మొదటి పేజీ తరువాయి



ఈ దాడి వెనుక ఎవరు ఉన్నారన్నది మాత్రం ఇంకా వివాదంగానే ఉంది. సౌదీ అరేబియా హౌతీలను బాధ్యులుగా చెబుతోంది. హౌతీలు మాత్రం ఆ ఆరోపణను తిరస్కరిస్తున్నారు. అయినా ఈ ఘటన జరిగిన సమయం, దాని వెనుక ఉన్న యుద్ధ వాతావరణం చూస్తే అసలు కథ మక్కా ఆకాశంలో మొదలైనది కాదని అర్థమవుతుంది.

ఆ కథ యెమెన్‌లోని రక్తంతో తడిసిన నేలలో మొదలైంది. యెమెన్‌లో హౌతీలు, సౌదీ అరేబియా మధ్య పోరు మళ్లీ తీవ్రమవుతోంది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్షిపణులు ఒకదానికొకటి సమాధానాలు చెబుతున్నాయి. హౌతీలు సౌదీ ఎఫ్-15 యుద్ధవిమానాన్ని యెమెన్‌లో కూల్చేశామని ప్రకటించారు. సౌదీ అరేబియా మాత్రం ఆ వాదనను ధృవీకరించలేదు.

ఇదే సమయంలో ఎర్ర సముద్ర తీర ప్రాంతాల్లో, బాబ్ అల్-మందెబ్ జలసంధి చుట్టూ కూడా సైనిక ఉద్రిక్తత పెరుగుతోంది. ఆ జలసంధి పేరు చాలామందికి తెలియకపోవచ్చు. కానీ ప్రపంచ వాణిజ్యానికి అది ఒక కీలకమైన ద్వారం. ఆ ద్వారం దగ్గర యుద్ధం మొదలైతే ప్రభావం యెమెన్‌లోనే ఆగిపోదు. నౌకలు మార్గాలు మార్చుకోవాల్సి వస్తుంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి. చమురు సరఫరాపై ఒత్తిడి పెరుగుతుంది. మధ్యప్రాచ్యంలో వెలిగిన ఒక్క మంట ప్రపంచ మార్కెట్లలో మరో రూపంలో కనిపిస్తుంది.

ఇంతలో సౌదీ చమురు వ్యవస్థపైనా దాడి జరిగింది. ఇరాక్ ప్రాంతం నుంచి ప్రయోగించినట్లు చెబుతున్న డ్రోన్లు సౌదీ ఈస్ట్-వెస్ట్ క్రూడ్ ఆయిల్ పైప్‌లైన్‌ను తాకాయి. ఆ మార్గాన్ని మరమ్మతుల కోసం తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది.

హోర్ముజ్ జలసంధి చుట్టూ రవాణా ప్రమాదంలో పడినప్పుడు సౌదీ చమురును అల్టెర్నెట్ మార్గంలో తరలించడానికి ఈ పైప్‌లైన్ అత్యంత కీలకం. ఆ మార్గంపై దెబ్బ పడటం అంటే సౌదీ ఆర్థిక వ్యవస్థలోని ఒక ముఖ్యమైన నరాన్ని కోయడానికి చేసిన ప్రయత్నంలా మారింది. యెమెన్ ప్రజల పరిస్థితి ఈ యుద్ధానికి మరో భయంకరమైన ముఖాన్ని చూపిస్తోంది. ఘర్షణలు పెరిగిన తర్వాత సుమారు లక్షా25వేల మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది.

కొందరు ప్రాణాలు కాపాడుకోవడానికి ఎర్ర సముద్రాన్ని దాటి జిబౌటికి చేరుకున్నారు. ఒకవైపు నేలపై ఇళ్లు ఖాళీ అవుతున్నాయి. మరోవైపు సముద్రంలో నౌకలు భయంతో మార్గాలు వెతుక్కుంటున్నాయి. ఆకాశంలో డ్రోన్లు తిరుగుతున్నాయి. ఇప్పుడు ఆ ఆకాశమే మక్కా వైపు వంగింది. మక్కా దిశగా వచ్చిన ఆ డ్రోన్ కూలిపోయింది కానీ ఈ ఘటనతో యెమెన్ యుద్ధం మరో ప్రమాదకరమైన సరిహద్దును తాకింది. ఇటు ముస్లిం దేశాల ఆగ్రహం పెరుగుతోంది. సౌదీ అరేబియా తన భద్రతను మరింత కఠినతరం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఎర్ర సముద్రం, బాబ్ అల్-మందెబ్, చమురు మార్గాలు ఇప్పటికే ఉద్రిక్తతలో ఉన్నాయి. ఇప్పుడు మక్కా పేరు కూడా ఈ యుద్ధం మధ్యలోకి వచ్చింది. నిజానికి యుద్ధాల్లో కొన్ని క్షణాలు బాంబుల కంటే పెద్ద శబ్దం చేస్తాయి. మక్కా వైపు దూసుకొచ్చిన ఆ డ్రోన్ అలాంటి క్షణమే. ఆకాశంలో అది కూలిపోయింది కానీ దాని నీడ ఇంకా మధ్యప్రాచ్యంపై నిలిచే ఉంది. మరి ఆ నీడ తర్వాత ఎన్ని విధ్వంసాలకు కారణమౌతుందో వేచిచూడాల్సిందే!

# ఫ్యూచర్ సిటీ.. డేటా దూకుడు!

మొదటి పేజీ తరువాయి




తాజాగా ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) డేటా సెంటర్ కోసం ఫ్యూచర్ సిటీలో పది ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో హైపర్‌స్కేల్ క్లౌడ్ సంస్థలతో పాటు బ్యాంకింగ్ రంగం కూడా రానుంది. ఎస్‌బీఐ డేటా సెంటర్ కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

రూ.60వేల కోట్లతో అమెజాన్ పెట్టుబడి

2025 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అమెజాన్‌తో కుదిరిన ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ప్రకారం రూ.60 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ అభివృద్ధికి సిద్ధపడింది. ఈ ఏడాది జూలై 15న సీఎం రేవంత్‌రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం కేటాయించిన 202 ఎకరాల్లో అమెజాన్ ఫ్లాగ్‌షిప్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులకు ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి వివరిస్తూ అమెజాన్ 60 వేల కోట్ల పెట్టుబడిని లక్ష కోట్లకు పెంచాలని ఆహ్వానించారు. అమెజాన్ డేటా సెంటర్ ప్రాజెక్టు ఫ్యూచర్ సిటీలో యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్‌గా నిలుస్తుందని, దీని ద్వారా ఫార్చ్యూన్-500 సంస్థలు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆ సందర్భంగా పేర్కొన్నారు. అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను ప్రభుత్వం చూసుకుంటుందని భరోసానివ్వడంతో అమెజాన్ ప్రతినిధులు వెంటనే ఆ దిశగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కాగా, సెప్టెంబర్ 5న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై ఫ్యూచర్ సిటీలో రూ.70 వేల కోట్లు పెట్టుబడితో 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటా సెంటర్ 2028 జూన్ 2 నాటికి, తెలంగాణ అవతరణ దినోత్సవానికి ప్రారంభించాలని సీఎం కోరారు. ఈ పెట్టుబడి టీసీఎస్ వైపు నుంచి ఇప్పటివరకు భారత్‌లో ప్రకటించిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి కావడం గమనార్హం. తాజాగా ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ సంస్థ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో సుమారు 170 ఎకరాల్లో హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రారంభ పెట్టుబడి రూ.60 వేల కోట్లు కాగా తర్వాతి దశల్లో మొత్తం పెట్టుబడి రూ.లక్ష కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఫ్యూచర్ సిటీలో కంట్రోల్ ఎస్ సంస్థకు సంబంచించిన భారీ 2 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ ఇప్పటికే నిర్మాణానికి నోచుకుంది. యూపీసీ వోల్ట్ సంస్థకు సంబంచించిన 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనపై సైతం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫ్యూచర్ సిటీలో జీసీసీలకు మార్గం సుగమం

హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రధాన జీసీసీ కేంద్రంగా దూసుకెళ్తున్నది. ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ద్వారా భారీ కంప్యూట్ మౌలిక సదుపాయాలు ఏర్పడితే, కొత్త జీసీసీలు, ఏఐ యూనిట్లు ఇక్కడికి రావడం సహజ పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు ఫ్యూచర్ సిటీ వైపు మరింత దృష్టి సారించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, జీసీసీల కోసం ఒక ప్రత్యేకమైన జోన్ వంటి ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా విడుదల చేసే భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌తో దీనిపై మరింత క్లారిటీ రానుంది.

# పులుమామిడి ప్రభుత్వ పాఠశాలలో దారుణం

**విద్యార్థులకు బలవంతంగా బైబిల్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు**

**క్రైస్తవ మతంలోకి మారాలని ఒత్తిడి**

**ఎవరికైనా చెప్తే చేతబడి చేస్తానంటూ విద్యార్థులకు బెదిరింపులు**

**విద్యార్థులను రక్తం వచ్చేలా కొడుతూ పైశాచికానందం**



ఇది కద నిజం, పులుమామిడి: వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం పులిమామిడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు సుధాకర్ మత మార్పిడికి పాల్పడుతున్నారని, విద్యార్థులను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. తరగతి గదిలో పాఠాలు బోధించాల్సిన సమయంలో బైబిల్ చదువుతూ, క్రైస్తవ మతంలోకి మారాలని ఒత్తిడి తెస్తున్నారని విద్యార్థులు వాపోయారు. అంతేకాకుండా తాన గురించి ఎవరికైనా చెప్తే చేతబడి చేస్తాను అంటూ విద్యార్థులను భయందోళనకు గురిచేస్తున్నాడు. తన మాట వినని విద్యార్థులను బూతు మాటలతో దూషిస్తూ కొడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు తాను సహనం కోల్పోయి విద్యార్థులను రక్తం వచ్చేలా కొట్టేవాడని తోటి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం బిజేవైఎం నవాబుపేట్ మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరి గౌడ్, బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి సారా జగన్ దృష్టికి వెళ్లడంతో వారు పాఠశాలను సందర్శించారు. ముందుగా హెచ్ఎమ్‌ను కలిసి పరిస్థితులపై చర్చించిన అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మతపరమైన ఒత్తిళ్లు లేకుండా విద్యార్థులందరినీ సమానంగా గౌరవించే సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని ప్రధానోపాధ్యాయురాలిని కోరారు. విద్యార్థుల భద్రత, గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేసిన నేతలు ఈ వ్యవహారంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది వాంగ్మూలాలను సేకరించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం నాయకులు శివచంద్ర రెడ్డి, వందేమాతరం, రమేష్, సుదర్శన్, గ్రామస్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ప్రయాణికుల తీవ్ర అవస్థలు

### కనీస సౌకర్యాలు కరవు




ఇది కద నిజం :ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలోని ప్రధాన ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ప్రయాణికుల ఇబ్బందులు రోజురోజుకూ వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఏలూరు వైపు వెళ్లే బస్సుల కోసం ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఈ కేంద్రం వద్ద వేచి చూస్తుంటారు. అయితే, ప్రయాణికులు కూర్చోవడానికి కనీసం సిమెంట్ బల్లలు కూడా అందుబాటులో లేకపోవడంతో, బస్సు కోసం గంటల తరబడి నిలబడలేక వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం ప్రయాణికుల రాకపోకలు సాగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సెంటర్‌లో కనీస ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంపై స్థానికులు మరియు ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ప్రయాణికుల కోసం సిమెంట్ బల్లలు లేదా ప్రయాణికుల షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# విద్యావంతులారా! ఉత్తమ నిర్ణయానికి సమయం ఆసన్నమైంది

**రండి... మన రాజ్యం మనం ఏలుదాం డిగ్రీ ఓటు హక్కు నమోదు చేసుకోండి**

**రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో జై స్వరాజ్ పార్టీ పోటీ**

**జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ వెల్లడి**




ఇది కద నిజం,హైదరాబాద్: విద్యావంతులు, పట్టభద్రులు ప్రజాస్వామ్యంలో తమకు ఉన్న ప్రత్యేక ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యవంతమైన నిర్ణయం తీసుకోవాలని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ పిలుపునిచ్చారు.

"విద్యావంతులారా! ఉత్తమ నిర్ణయానికి సమయం ఆసన్నమైంది. రండి... మన రాజ్యం మనం ఏలుదాం. మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి" అని ఆయన కోరారు.

జై స్వరాజ్ పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రకటించారు.

విద్యావంతుల ఓటు --- భవిష్యత్తుకు దిశానిర్దేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక వ్యక్తిని ఎన్నుకునే ఎన్నికలు మాత్రమే కాదని, విద్యావంతుల సమస్యలు, యువత భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు, విద్యా వ్యవస్థ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, పారిశ్రామిక అవకాశాలు, సామాజిక–ఆర్థిక భద్రత వంటి అంశాలపై ప్రజా ప్రతినిధిత్వానికి సంబంధించిన ఎన్నికలని ఆయన అన్నారు.

డిగ్రీ చదివిన ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన పేరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, లేకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల సంఘం ప్రకారం గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావడానికి ఫారం--18 ద్వారా దరఖాస్తు చేయాలి. అర్హతకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

"ఓటు హక్కు నమోదు చేసుకోవడం మొదటి అడుగు"

"ఓటు వేయడం కంటే ముందే ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. మన సమస్యలను మనమే చర్చించాలి. మన భవిష్యత్తుపై మనమే నిర్ణయం తీసుకోవాలి. విద్యావంతులు రాజకీయ ప్రక్రియకు దూరంగా ఉంటే, తమ తరపున నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇతరులకు అప్పగించినట్టే అవుతుంది" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

గ్రాడ్యుయేట్ల ప్రధాన సమస్యలపై జై స్వరాజ్ పోరాటం

జై స్వరాజ్ పార్టీ గ్రాడ్యుయేట్ల సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువతకు భవిష్యత్ రోడ్‌మ్యాప్, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, విద్యా రంగంలో నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతులకు అవకాశాల కల్పన, కుటుంబ ఆర్థిక భద్రత వంటి అంశాలను ప్రధానంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

"డిగ్రీ పూర్తయింది... తరువాత ఏంటి? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చే రాజకీయ వ్యవస్థ కావాలి. విద్యను కేవలం సర్టిఫికెట్‌గా కాకుండా, మానవ వనరులను ఉత్పాదక శక్తులుగా మార్చే సాధనంగా చూడాలి" అని ఆయన పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యంతో విద్యావంతుల భవిష్యత్తుకు కొత్త దిశ

జై స్వరాజ్ పార్టీ ప్రతిపాదిస్తున్న గ్రామ స్వరాజ్యం కేవలం గ్రామాల పరిపాలనకు సంబంధించిన ఆలోచన మాత్రమే కాదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత, పట్టభద్రులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులకు స్థానికంగా అవకాశాలు సృష్టించే సమగ్ర అభివృద్ధి నమూనా అని కాసాని శ్రీనివాసరావు గౌడ వివరించారు.

గ్రామాలకు అధికారాలు, వనరులు, బాధ్యతలు బదలాయించి స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తే ఉపాధి, స్వయం ఉపాధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సేవా రంగం, చిన్న వ్యాపారాలు వంటి అనేక అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

"ప్రతి పట్టభద్రుడు తన ఓటును తన భవిష్యత్తుగా చూడాలి"

పట్టభద్రులు రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే చూడకుండా, విధానాల రూపకల్పనలో తమ పాత్రను గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. "మీ డిగ్రీ మీ విద్యకు గుర్తింపు. మీ ఓటు మీ భవిష్యత్తుపై మీ హక్కుకు గుర్తింపు. ఆ హక్కును వదులుకోవద్దు. ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు ముందుగా తన పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలి. అనంతరం అభ్యర్థుల విధానాలు, ఆలోచనలు, ప్రజా కార్యక్రమాలను పరిశీలించి తన నిర్ణయం తానే తీసుకోవాలి" అని ఆయన అన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ

జై స్వరాజ్ పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతోందని కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు.

విద్యావంతులు, మేధావులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న పట్టభద్రులు, గ్రామీణ ప్రాంతాల విద్యావంతులతో విస్తృతంగా చర్చలు నిర్వహించి వారి సమస్యలను ఎన్నికల కార్యాచరణలో భాగం చేస్తామని ఆయన చెప్పారు. "ఇది కేవలం జై స్వరాజ్ పార్టీ ఎన్నికల కార్యక్రమం కాదు. విద్యావంతుల సమస్యలను ప్రజా చర్చలోకి తీసుకువచ్చే ఒక అవకాశం. మన రాజ్యం మనం ఏలుదాం అనే భావనను ప్రజాస్వామ్య మార్గంలో బలోపేతం చేయడమే మా లక్ష్యం" అని ఆయన తెలిపారు.

విద్యావంతులకు పిలుపు

అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు వెంటనే గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియపై సమాచారం తెలుసుకుని తన పేరు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కాసాని శ్రీనివాసరావు గౌడ కోరారు.

"విద్య మనకు జ్ఞానాన్ని ఇచ్చింది.
ఓటు మనకు నిర్ణయాధికారాన్ని ఇస్తుంది.
ఆ నిర్ణయాధికారాన్ని వినియోగిద్దాం.
మన భవిష్యత్తును మనమే నిర్మించుకుందాం.
మన రాజ్యం --- మనం ఏలుదాం."
అని ఆయన పిలుపునిచ్చారు.

# చింతలపూడిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆగ్రహం



ఇది కద నిజం :ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలపై స్థానిక శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తీవ్రంగా స్పందించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై వాహనాలను అస్తవ్యస్తంగా నిలిపి ఉంచడాన్ని గమనించిన ఎమ్మెల్యే. సంబంధిత షాపులు, దుకాణాల యాజమాన్యాలను బయటకు పిలిచి, రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. దుకాణాల ముందుకు వచ్చే వాహనాలను క్రమబద్ధంగా పార్కింగ్ చేయించాలని, పట్టణ రహదారులు విశాలంగా, ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులను ఘటనా స్థలానికి పిలిపించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్, చింతలపూడి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వెంటనే క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ రహదారులను దిగ్బంధించే వాహనాలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యార్థం, సురక్షితమైన ప్రయాణం కోసం మరియు 'బంగారు చింతలపూడి' నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించాల్సిందేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు!



ఇది కద నిజం, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ ప్రాంగణం వినాయక నిమజ్జన శోభతో మైమరిపిస్తోంది. గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తున్నారు. మినీ ట్యాంక్‌బండ్ తీరమంతా గణపతి బప్పా మోరియా నామస్మరణలతో మారుమోగిపోతోంది. ఈ నిమజ్జన మహోత్సవంలో స్థానిక యువకులు రాహుల్ కిషోర్ యాదవ్, ప్రమోద్ ముదిరాజ్, పెద్ది యాదవ్, పునీత్ కిషోర్ యాదవ్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేడుకగా నిమజ్జన ప్రక్రియను పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు సాగేలా స్థానిక భక్తులు, యువకులు విశేష కృషి చేస్తున్నారు.

# పిట్లంలో 'కాగితం పడవలు' మూవీ విడుదల వేడుక




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి చెందిన 'కాగితం పడవలు' చిత్ర దర్శకుడు ఎంజీఆర్ తుకారాం ఆధ్వర్యంలో సినిమా విడుదల వేడుకను ఘనంగా నిర్వహించారు. పిట్లం వెంకటేశ్వర థియేటర్‌లో కేక్ కట్ చేసి చిత్ర విడుదలను వారి తండ్రి తో అభిమానులతో పాటు కలిసి పండగ వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తుకారాం అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానులతో థియేటర్ పరిసరాలు కోలాహలంగా మారాయి. తండ్రితో కలిసి వచ్చిన తుకారాం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అభిమానులు, గ్రామ ప్రజలతో కలిసి థియేటర్‌లో 'కాగితం పడవలు' చిత్రాన్ని వీక్షించారు.

# జీలుగుమిల్లిలో వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ఇది కద నిజం: జీలుగుమిల్లి మండల కేంద్రంలోని గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం మమతా హాస్పిటల్ వైద్య బృందం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, అలాగే శ్రీ సూర్య బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలకు తగిన సూచనలు మరియు మందులు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని అన్నారు. యువత రక్తదాన కార్యక్రమాల్లో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా సంస్థలు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి. ఎజ్రా శాస్త్రి, గ్రేస్ మందిర్ యూత్ సభ్యులు, కూటమి నాయకులు పద్దం వెంకటకృష్ణ, నెలటూరి మోహన్,, డాక్టర్ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభలో జుక్కల్ సమస్యలను ప్రస్తావించిన జుక్కల్ ఎమ్మెల్యే


**లెండి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి**

**ఆసుపత్రుల్లో డిజిటల్ హాజరు అమలు చేయాలి**



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జుక్కల్: జుక్కల్ నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలంగాణ శాసనసభలో ప్రస్తావించారు. రైతులకు సాగునీరు అందించేందుకు లెండి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది హాజరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు బయోమెట్రిక్ లేదా డిజిటల్ వేలిముద్రల ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను శాసనసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు

# సినిమా న్యూస్




## సైన్స్ ఫిక్షన్‌తో 'వెట్టువం'

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వెట్టువం'. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో ఆర్య, శోభిత, దినేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. నేడు ఘనంగా ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలతో పాటు షూటింగ్‌ను ప్రారంభించారు మేకర్స్. ఇక ఈ వేడుకల్లో పాల్గొన్న హీరో ఆర్య చేసిన ఆసక్తికరమైన వ్యాఖ్యలు సోషల్ మీడియాలోవైరల్‌గా మారాయి. ఈ సినిమా కథ ఏమిటనేది కూడా తాను పూర్తిగా వినకుండానే, కేవలం పా రంజిత్ పై ఉన్న నమ్మకంతోనే ఇందులో నటించడానికి వెంటనే అంగీకరించినట్లు ఆర్య వెల్లడించారు. ఈ చిత్రంలో ఎంతో మంది స్టార్స్ నటిస్తున్నారని, ఆ అద్భుతమైన జర్నీలో తాను కూడా ఒక భాగం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పా రంజిత్‌తో పనిచేసిన అనుభవం గురించి ఆర్య చెబుతూ.. ఆయన భారతదేశంలోని అత్యుత్తమ దర్శకులలో ఒకరని, అంతేకాకుండా తాను ఇప్పటివరకు పనిచేసిన డైరెక్టర్లలో అసలు ఎలాంటి అహంభావం లేని వ్యక్తి పా రంజిత్ మాత్రమేనని ప్రశంసించారు. ఆయన ఆలోచనా విధానం, సినిమాను తెరకెక్కించే తీరు ఎంతో ప్రత్యేకంగా ఉంటాయని అన్నారు.

ఇక 'వెట్టువం' సినిమా గురించి మాట్లాడుతూ.. ఇది పా రంజిత్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, భారీ లక్ష్యాలతో తెరకెక్కుతున్న ఆశాజనకమైన చిత్రమని చెప్పారు. ఈ సినిమాలో కేవలం ఒకే జోనర్ కాకుండా.. ప్రపంచ వినాశన నేపథ్యం, సైన్స్ ఫిక్షన్ వంటి వివిధ రకాల జోనర్లను ఎంతో అద్భుతంగా మిళితం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో పా రంజిత్ దర్శకత్వంలో వచ్చిన 'తంగలాన్' సినిమా తనకు వ్యక్తిగతంగా ఎంతో బాగా నచ్చిందని ఆర్య గుర్తుచేసుకున్నారు. అయితే ఆ సినిమా అనుకున్నంత స్థాయిలో ప్రేక్షకులకు రీచ్ కాలేదని పా రంజిత్ భావించారని తెలిపారు. రాబోయే 'వెట్టువం' విషయంలో మాత్రం అలాంటి పొరపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని, సినిమా అందరికీ సులభంగా చేరేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన చెప్పినట్లు ఆర్య వెల్లడించారు. దర్శకుడిగా తన సినిమా రీచ్ గురించి ఇంత ఓపెన్‌గా ఆలోచించి, మార్పులు కోరుకునే పా రంజిత్ ఆలోచనా విధానానికి తాను నిజంగా హ్యాట్స్ ఆఫ్ చెబుతున్నానని ఆర్య ప్రశంసించారు. ఈ కామెంట్స్‌తో ప్రేక్షకుల్లో 'వెట్టువం'పై భారీ హైప్ నెలకొంది.




## సూర్య మాస్ అవతార్!

ఇటీవల 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకున్న కోలీవుడ్ స్టార్ హీరో సూర్య.. ప్రజెంట్ తన తదుపరి చిత్రంపై ఫోకస్ పెట్టాడు. సూర్య ప్రధాన పాత్రలో, 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న హై వోల్టేడ్ యాక్షన్ డ్రామా 'Suriya 47'. తాజాగా ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ తమిళ టైటిల్ టీజర్‌ను వదిలిన విషయం తెలిసిందే. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు టైటిల్ పోస్టర్‌తో పాటు టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ టీజర్‌లో 'నీకు నేను నిన్ను అరెస్ట్ చేసిన ఒక పోలీసుని కావొచ్చు. కానీ నాకు.. నేను జైల్లో వేసిన 900 మంది చిల్లర క్రిమినల్స్‌లో నువ్వో చిల్లరగాడివి..' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్‌తో ఆకట్టుకుంటున్నాడు హీరో సూర్య. డీఎస్పీ ప్రేమ్ రాజ్‌గా ఆయన కనిపించిన తీరు ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నెలకొల్పోతున్నది. ప్రజెంట్ ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతూ ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నది.

## రియల్ స్టార్ నయా అవతార్

కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన ఉపేంద్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ తెగ వైరలవుతోంది.

ప్రపంచాన్ని తలకిందులు చేసేందుకు రియల్ స్టార్ సిద్ధమవుతున్నారంటూ చిత్రబృందం విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు వెండితెరపై ఎన్నడూ చూడని సరికొత్త, వైవిధ్యమైన అవతార్‌లో ఉపేంద్ర కనిపించబోతున్నారని మేకర్స్ తెలిపారు. ఆయన పాత్రలో కనిపించే మ్యాడ్‌నెస్, మరియు మాస్ కలగలిసిన సరికొత్త ఫ్లేవర్ ప్రేక్షకులను ఖచ్చితంగా షాక్‌కు గురిచేసేలా ఉంటుందని యూనిట్ పేర్కొంది.

సూపర్‌హీరో తేజ సజ్జాతో కలిసి ఉపేంద్ర స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ఈ సినిమాకు ప్రధాన హైలైట్ కానుంది. వీరిద్దరి కలయికలో వచ్చే మాస్ రచ్చ ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రస్తుతం సర్వత్ర నెలకొంది. మొత్తానికి 'జాంబీ రెడ్డి 2' తో రాబోతున్న ఈ నెక్స్ట్ లెవెల్ మ్యాడ్‌నెస్ కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.





## ఓటీటీలో 'ఇరుముడి'

మాస్ మహారాజ రవితేజ హీరోగా, ప్రియా భవాని శంకర్ కథానాయికగా ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం 'ఇరుముడి'. వరుస ఫ్లాప్స్ తో సతమతమవుతున్న రవితేజకు ఇరుముడి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఇచ్చింది. అయ్యప్ప స్వామి భక్తుడిగా రవితేజ విభిన్నమైన పాత్రలో నటించి మెప్పించాడు. ఎమోషనల్ సీన్స్ లో తన అభినయం మొత్తం సినిమాకే మెయిన్ హైలైట్ అనే చెప్పాలి. రవితేజ కెరీర్‌లోనే కాకుండా టోటల్ టాలీవుడ్‌లోనే ఒక రికార్డ్ బ్రేకింగ్ హిట్‌గా నిలిచిన ఈ సినిమా థియేటర్లలో ఇంకా మంచి రన్ కొనసాగిస్తున్నప్పటికీ ఫైనల్‌గా డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేసింది.

ఈ సంచలన చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దిగ్గజ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. ముందుగా చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఈ సినిమాను నేటి నుంచి ఈ డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తీసుకువచ్చింది నెట్ ఫ్లిక్స్. ఆగస్టు 21న రిలీజ్ అయిన ఈ సినిమా నాలుగు వారాల తర్వాత తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. స్ట్రాంగ్ ఎమోషన్స్, రేసీ స్క్రీన్‌ప్లేతో బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు సాధించిన ఈ చిత్రాన్ని థియేటర్లలో మిస్ అయినవారు మరియు మళ్లీ చూడాలనుకునేవారు ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో మీ ఇంట్లోనే ఆస్వాదించవచ్చు.




## 'దాదా'టార్గెట్ ఫిక్స్

నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా చిత్రం 'దాదా'. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలయ్యకు జోడిగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, విలన్‌గా మంచు మనోజ్ సరికొత్త పవర్‌ఫుల్ పాత్రలో అలరించనున్నారు.

బాలయ్య గాయం కారణంగా షూటింగ్ కు గతకొంతకాలంగా బ్రేక్ ఇచ్చారు మేకర్స్. ఇటీవల తిరిగి షూటింగ్ ను స్టార్ట్ చేసి బాలయ్య లేని సీన్స్ ను తీస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి కేవలం 20 నుంచి 25 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని తెలుస్తోంది. అక్టోబర్ నాటికి మొత్తం షూటింగ్‌ను పూర్తి చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగవంతం చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది అనుకున్న షెడ్యూల్ ప్రకారం అన్ని పనులను పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 24న 'దాదా' చిత్రాన్ని గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ సంగీతాన్ని అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై సతీష్ కిలారు ఈ సినిమాను ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత నిర్మాణ విలువల తో నిర్మిస్తున్నారు.